అలవికాని వాగ్దానాలు ఇచ్చిన కాంగ్రెస్

ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి

మెదక్, మార్చి 22 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ సర్కార్ ఇచ్చిన హామీల అమలు ఎలా ఉందంటే 'ఆహనా పెళ్లంట' సినిమాలోని ఓ సీన్‌కు సరిపోతుందని ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ సర్కార్ ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు కాలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ కొట్టుకుపోతుందన్నారు. మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. రుణమాఫీ, రైతు భరోసా, పింఛన్లు ఇలా ఏవీ చేయకుండా రైతులు, ప్రజలను మోసం చేస్తుందని వాపోయారు.

పెండింగ్ కేసులను సత్వరం పరిష్కరించాలి

- ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ

మెదక్ అర్బన్, మార్చి 22: పెండింగ్ కేసులను సత్వరం పరిష్కరించాలని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి సూచించారు. శనివారం ఎస్పీ ప్రధాన కార్యాలయంలో నెలవారి సమీక్ష నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ.. కొత్త కేసులతో పాటు పెండింగ్‌లో ఉన్న కేసులను ఎప్పటికప్పుడు సమీక్షించి, కేసుల సంఖ్య తగ్గించేలా అన్ని స్థాయిల అధికారులు పనిచేయాలన్నారు. నేర నియంత్రణలో భాగంగా ప్రతి పట్టణంలోని కాలనీలు, గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. పిల్లలకు ఒంటి పూట బడులు కావడంతో బావులు, వాగులు, వంకల్లో ఈతకు వెళ్లే ప్రమాదం ఉందని, తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఒంటరిగా, స్నేహితులతో పిల్లలను ఈతకు పంపవద్దన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ మహేందర్, మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్, తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

కోత దశలోనే పంట కోయించాలి

- అదనపు కలెక్టర్ నగేశ్

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నగేశ్

మెదక్, మార్చి 22 (నమస్తే తెలంగాణ): పొలం కోత దశకు వచ్చిన తర్వాతనే యంత్రాలు వినియోగించి పంట కోయించాలని అదనపు కలెక్టర్ నగేశ్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో సమావేశ హాలులో అధికారులతో కలిసి హార్వెస్టర్ యజమానులతో యాసంగి కోతలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి కోతలు సాగుతున్నందున హార్వెస్టర్ యజమానులు బ్లోయర్ ఆన్‌లో ఉండాలన్నారు. 18-20 మధ్యలో ఆర్పియం ఉండాలని, A2-B1 గేర్ మధ్యలో నడవాలని సూచించారు. పంట పూర్తిగా కోతకు వచ్చిన తర్వాత కోయడంతో తేమశాతం, తాలు, గడ్డి లేకుండా నాణ్యమైన పంట వచ్చే అవకాశం ఉంటుందన్నారు.

బీవీఆర్ఐటీని సందర్శించిన కెనడా ప్రొఫెసర్

విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రొఫెసర్ జాన్ ఎ కెర్స్వా

నర్సాపూర్, మార్చి 22: నర్సాపూర్‌లోని బీవీఆర్ఐటీ కళాశాలను కెనడా దేశ పురాతన న్యూ బ్రున్స్విక్ విశ్వవిద్యాలయం (యూఎన్‌బీ) ప్రొఫెసర్ జాన్ ఎ కెర్స్వా శనివారం సందర్శించారు. విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి యూఎన్‌బీ విశ్వవిద్యాలయం గురించి సమాచారం అందించారు. గూగుల్ మ్యాప్స్ టెక్నాలజీ యూఎన్‌బీ నుంచి ఆవిర్భవించిందన్నారు. శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ, యూఎన్‌బీ మధ్య ప్రతిపాదిత ఇంటిగ్రేటెడ్ కోర్సు వివరాలు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంజయ్ దూబే, డైరెక్టర్ డాక్టర్ లక్ష్మీప్రసాద్, ఇండస్ట్రీ రిలేషన్స్ డైరెక్టర్ సతీష్‌చంద్ర, మేనేజర్ బాబిరాజు, హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ కో-ఆర్డినేటర్ ప్రణీత పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు నరేంద్రనాథ్ గౌడ్

పాపన్నపేట, మార్చి 22: ఈనెల 27 నుంచి 30 వరకు బీహారులో నిర్వహించనున్న జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు మెదక్ జిల్లా నుంచి నరేంద్రనాథ్ గౌడ్ ఎంపికైనట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రెసిడెంట్ మధుసూదన్‌రెడ్డి, సెక్రటరీ రమేశ్ తెలిపారు. నరేంద్రనాథ్ జాతీయ స్థాయికి ఎంపిక కావడంపై అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

కారు, ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరు మృతి

మల్లేశం (ఫైల్)

కొల్చారం, మార్చి 22: ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు, కారును ఢీకొట్టింది. దీంతో కారు డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందిన ఘటన కొల్చారం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. తిమ్మూపూర్‌కు చెందిన పిల్లి మల్లేశం(38) కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం వ్యక్తిగత అవసరాల నిమిత్తం మెదక్ వెళ్లి అదే రోజు సాయంత్రం తిరిగి వస్తున్నాడు. ఈదురు గాలులతో కూడిన గాలిదుమారం రేగింది. ఈ క్రమంలో కొల్చారం శివారులోని లోతువాగు మూల మలుపు వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు కారును ఢీకొట్టింది. ఈ ఘటనలో మల్లేశానికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే మెదక్ ఏరియా దవాఖానకు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గౌస్ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

టేక్మాల్‌లో కుస్తీ పోటీలు

కుస్తీ పోటీల్లో తలపడుతున్న మల్లయోధులు

టేక్మాల్, మార్చి 22: ఏటా హోలీ పండుగ అనంతరం టేక్మాల్‌లో దుర్గమ్మ, పోచమ్మ జాతరలో భాగంగా శనివారం కుస్తీ పోటీలు నిర్వహించారు. ఉమ్మడి మెదక్ జిల్లాతో పాటు నిజామాబాద్, కామారెడ్డి, పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్ర నుంచి పెద్ద సంఖ్యలో మల్లయోధులు తరలి వచ్చారు. ఈ పోటీల్లో కర్ణాటక చించోలి ప్రాంతానికి చెందిన హనుమంతు విజేతగా నిలిచాడు. అతడికి ఎస్సై రాజేశ్ వెండి కడియాన్ని అందజేశారు.

బడ్జెట్‌లో అంకెలే తప్ప ఏమీ లేదు: డీహెచ్‌పీఎస్

మెదక్ జిల్లా మహాసభలో మాట్లాడుతున్న అనిల్‌కుమార్

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 22: బడ్జెట్‌లో అంకెలు పెంచుతున్నారు తప్ప.. ఖర్చు చేయడం లేదని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ విమర్శించారు. శనివారం మెదక్‌లోని టీఎన్జీవో భవన్‌లో డీహెచ్‌పీఎస్ జిల్లా మూడో మహాసభకు హాజరయ్యారు. మహాసభలో సీపీఐ జిల్లా మాజీ కార్యదర్శి రాజిరెడ్డి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పానుగంటి నందం, డీహెచ్‌పీఎస్ జిల్లా నాయకులు సంతోష్, సంగమేశ్వర్, కిషన్, శ్రీనివాస్, భిక్షపతి, వినయ్, లక్ష్మణ్, గౌతమ్ పాల్గొన్నారు.

బడుల్లో పనులపై ప్రతిపాదనలు తయారుచేయాలి

- **అన్ని వసతులు కల్పించేందుకు దృష్టి సారించాలి:**
- **కలెక్టర్ రాహుల్ రాజ్**

తొనిగండ్ల ఫారెస్ట్ బ్రిడ్జి కండిషన్ పరిశీలించిన కలెక్టర్

అధికారులతో సమీక్షా నిర్వహిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 22: జిల్లాలో పాఠశాలలు పునఃప్రారంభం నాటికి అత్యవసర పనులపై ప్రతిపాదనలు తయారు చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ శాఖల జిల్లా అధికారులతో అత్యవసర పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖను బలోపేతం చేసే దిశగా కార్పొరేట్ స్థాయిలో అన్ని వసతులు కల్పిస్తున్నదన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో అత్యవసర మరమ్మతుల్లో మరుగుదొడ్లకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. తాగునీరు సమస్యపై దృష్టి సారించాలని, రూప్ లీకేజీ, ప్లంబింగ్, తలుపులు, కిటికీల మరమ్మతులు చేయించాలన్నారు. అద్దె ప్రాతిపదికన నడుస్తున్న సంక్షేమ పాఠశాలలు వసతి గృహాల భవనాల యాజమానులతో మాట్లాడి మరమ్మతులు పూర్తి చేసి, వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. సమావేశంలో మైనారిటీ సంక్షేమ అధికారి జమ్లానాయక్, గిరిజన సంక్షేమ అధికారిణి నీలిమ, ఎస్సీ సంక్షేమ అధికారిణి చంద్రకళ, బీసీ సంక్షేమ అధికారి జగదీశ్, సంబంధిత గురుకులాల ప్రిన్సిపాళ్లు, అధికారులు పాల్గొన్నారు.

ఫారెస్ట్ బ్రిడ్జి కండిషన్ పరిశీలించిన కలెక్టర్

రామాయంపేట, మార్చి 22: రామాయంపేట మండలం తొనిగండ్ల శివారు మెదక్ నుంచి సిద్దిపేట నేషనల్ హై వే 765 డీజీ 12 కిలోమీటర్లు ఫారెస్ట్ బ్రిడ్జిని కలెక్టర్ పరిశీలించారు. వానకాలాన్ని దృష్టిలో పెట్టుకొని ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా తాత్కాలిక రోడ్డు త్వరగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

సజావుగా పది పరీక్షలు

- **జిల్లా కేంద్రంలోని పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ రాహుల్ రాజ్**
- **పెద్దశంకరంపేటలో విద్యాశాఖ జిల్లా అధికారి రాధాకిషన్**

జిల్లా కేంద్రంలోని పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాల ద్వారా పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 22: పదో తరగతి పరీక్ష రెండో రోజు శనివారం సజావుగా జరిగింది. జిల్లా వ్యాప్తంగా 68 పరీక్షా కేంద్రాల్లో 10,384 మందికి 10,364 మంది 99.80 శాతం విద్యార్థులు హాజరయ్యారని డీఈవో రాధాకిషన్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలోని పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ రాహుల్ రాజ్ సందర్శించారు. సౌకర్యాలు, వసతులను పరిశీలించి, అధికారులకు సూచనలు చేశారు. ప్రశ్న పత్రాలను తప్పనిసరిగా పోలీసు బందోబస్తు మధ్య పరీక్షా కేంద్రాలకు తరలించాలని అధికారులకు సూచించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున విద్యార్థులకు తాగు నీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. నర్సాపూర్, చేగుంట, శంకరంపేట(ఆర్), నార్సింగి, రామాయంపేట, నిజాంపేట మండలాల్లోని 22 పరీక్షా కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం ఆకస్మిక తనిఖీలు చేపట్టింది. అల్లాదుర్గం, శంకరంపేట(ఏ), రేగోడ్ మండలాల్లోని 6 పరీక్ష కేంద్రాలను డీఈవో సందర్శించారు.

పరీక్షా కేంద్రాల్లో అన్ని వసతులు: డీఈవో

పెద్దశంకరంపేట, మార్చి 22: జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అన్ని రకాల వసతులు కల్పించినట్లు డీఈవో రాధాకిషన్ తెలిపారు. శనివారం పెద్దశంకరంపేటలోని జడ్పీహెచ్ఎస్‌లోని పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని, విద్యార్థులు భయాందోళనకు గురికాకుండా రాయాలన్నారు.

వర్గ పోరుతో నిలిచిన సీసీ రోడ్డు పనులు

ప్రాథమిక పాఠశాలకు వెళ్లే దారిలో కాంగ్రెస్ నాయకుల వర్గ పోరుతో సగంలోనే ఆగిన సీసీ రోడ్డు పనులు

ఉన్నత పాఠశాలకు వెళ్లే దారిలో వర్గ పోరుతో కంకర వేసి ఆపేసిన పనులు

నిజాంపేట, మార్చి 22: నిజాంపేటలో కాంగ్రెస్ లీడర్ల వర్గ పోరుతో సీసీ రోడ్డు పనులు నిలిచిపోయాయి. గ్రామంలో ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలకు వెళ్లే మట్టి రోడ్లు గుంతలుగా ఉండడంతో విద్యార్థులకు తీవ్ర ఇబ్బంది కలుగుతున్నదని ఓ వర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు సీసీ రోడ్డు వేయించాలని నిశ్చయించుకుని కాంట్రాక్టర్‌కు సూచించారు. దీంతో కాంట్రాక్టర్ సీసీ రోడ్డుకు సంబంధించిన కంకర, సిమెంట్ బస్తాలు, మెటిరియల్‌ను తీసుకొచ్చి ఆ రోడ్డులో సీసీ వేస్తున్నాడు. మరో వర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు అక్కడ సీసీ రోడ్డు వేయొద్దంటూ హుకూం జారీ చేశారు. దీంతో ఆ రోడ్డు పనులు మధ్యలోనే ఆపేశారు. ఉన్నత పాఠశాలకు వెళ్లే దారిలో సీసీ వేద్దామని జేసీబీతో రోడ్డును తవ్వేశారు. వర్గ పోరుతో సీసీ పనులు ప్రారంభం కాకా, ఆ దారి వెంబడి మట్టిపెళ్లలపై వెళ్తున్న విద్యార్థులకు నరకప్రాయంగా మారింది. కాంగ్రెస్ నాయకులు వర్గపోరును వదిలి నిలిచిపోయిన సీసీ రోడ్డు పనులను పునఃప్రారంభించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు కోరుతున్నారు.

ఏడాదిలోనే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత: బీఆర్ఎస్వీ

పోలీసుల అదుపులో రంజిత్‌గౌడ్

నిజాంపేట, మార్చి 22: ఏడాది కాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చిందని బీఆర్ఎస్వీ నియోజక వర్గం అధ్యక్షుడు రంజిత్‌గౌడ్ అన్నారు. బీఆర్ఎస్ నుంచి ఏ పిలుపు లేకున్నా పోలీసులు తనను ముందస్తు అరెస్ట్ చేయడం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. అంసెబ్లీ ముట్టడికి, ధర్నాలకు వెళ్తున్న వారిని ముందస్తు అరెస్ట్ చేయడం చూశామని, ఏ కారణం లేకున్నా అరెస్ట్ చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికే చెల్లిందన్నారు. ప్రతి పక్ష నాయకుల అరెస్ట్‌పై చూపుతున్న శ్రద్ధలో సగం ఆరు గ్యారెంటీలపై పెడితే అమలు అవుతుండేవన్నారు.

నస్కల్‌లో ప్రపంచ నీటి దినోత్సవం

ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, సంస్థ ప్రతినిధులు

నిజాంపేట, మార్చి 22: మండలంలోని నస్కల్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు, బాలవికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా శనివారం ర్యాలీ నిర్వహించారు. నీటి ప్రాముఖ్యతను గ్రామస్తులకు సంస్థ సూపర్‌వైజర్ పరశురాం, జోనల్ డైరెక్టర్ జీడి తిరుపతి తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు వెంకట్, శ్రీనివాస్, దేవరాజు, నరేశ్, హెచ్ఎం దుర్గయ్య పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా

ధర్నా చేస్తున్న కాలనీవాసులు

పెద్దశంకరంపేట, మార్చి 22: పట్టణంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆయా కాలనీవాసులు శనివారం ధర్నా నిర్వహించి, నిరసన వ్యక్తం చేశారు. పట్టణంలోని దుర్గాహవాని మాత ఆలయం, 2వ వార్డులో మిషన్ భగీరథ నీరు రావడంలేదని, వీధి దీపాలు వెలగడం లేదని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా వారు స్పందించి కాలనీల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరారు.

విద్యార్థులకు హెడ్, మైక్రో ఫోన్లు అందజేత



విద్యార్థులకు హెడ్, మైక్రో ఫోన్‌లు అందజేస్తున్న బృందం సభ్యులు

చేగుంట, మార్చి 22: హైదరాబాద్‌కు చెందిన ఇన్నింగ్స్-2 టీమ్ శ్రీకాంత్ బృందం సభ్యులు చేగుంటలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల, కళాశాలలో విద్యార్థులకు కంప్యూటర్‌కు ఉపయోగపడే హెడ్, మైక్రో ఫోన్లను శనివారం అందజేశారు. విద్యార్థులు గణితం నేర్చుకుంటే సులభతరంగా జవాబులు చేయవచ్చని చేగుంట ప్రభుత్వ పాఠశాల పూర్వపు విద్యార్థి శ్రీకాంత్ తెలిపారు. ప్రిన్సిపాల్ చంద్రకళ, అధ్యాపకులు, ఇన్నింగ్స్-2 టీమ్ బృందం సభ్యులు అల్లీ శ్రీకాంత్, వాసవి, చరిష్మా, టీచర్ మనోహర్‌రావు ఉన్నారు.

ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణపై అవగాహన

మాట్లాడుతున్న ఎంపీడీవో కృష్ణమూర్తి

మనోహరాబాద్, మార్చి 22: మండలంలోని దండుపల్లిలో ఐటీసీ సునేహ్రాకల్ వాష్-ఐ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణపై శనివారం అవగాహన కల్పించారు. ఎంపీడీవో కృష్ణమూర్తి మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాలను కాల్చడం, పారవేయడంతో పర్యావరణాన్ని ప్రభావితం చేస్తాయన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు బాలకృష్ణ, ఏపీవో జనార్దన్, కమ్యూనిటీ మొబిలైజర్ ఆర్.మల్లేశ్, ఐజిన్ ఎడ్యుకేటర్ మహేశ్ పాల్గొన్నారు.

రోడ్డుతో పాటు డ్రైనేజీని నిర్మించండి

మేనేజర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ప్రజలు

రామాయంపేట, మార్చి 22: పట్టణంలో రోడ్డు పనులను మొదలు పెడ్తున్న ప్రభుత్వం రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీని నిర్మించాలని మూడోవార్డు బీఆర్ఎస్ నాయకులు, ప్రజలు కోరుతున్నారు. శనివారం బీఆర్ఎస్ నాయకులు పురపాలిక మే నేజర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని ప్రభుత్వ దవాఖాన నుంచి వెంకటేశ్వర కాలనీ, హమాలీ కాలనీ మీదుగా కేసీఆర్ కాలనీ డబుల్‌బెడ్‌రూమ్‌ల వరకు రోడ్డును ప్రభుత్వం మంజూరు చేసింది.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు విచారణ

కేసు దర్యాప్తు చేస్తున్న డీఎస్పీ వెంకట్‌రెడ్డి

వెల్దుర్తి, మార్చి 22: వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి శనివారం దర్యాప్తు చేసి సాక్షుల వాగ్మూలం నమోదు చేశారు. మండలంలోని నెల్లూర్‌కు చెందిన దాసరి బాబును అదే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా కొట్టారు. దీంతో శుక్రవారం వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సమాచారం తెలుసుకున్న తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి గ్రామానికి చేరుకొని విచారణ చేపట్టారు.

సమస్యల కోసం ఉద్యమిస్తే అరెస్టులా?: సీఐటీయూ

రామాయంపేట, నర్సాపూర్‌లో సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీఐటీయూ నాయకులు

మెదక్‌లో ప్లకార్డులతో నాయకురాల నిరసన

రామాయంపేట, మార్చి 22: సమస్యల పరిష్కారం కోసం నిరసనలు, ధర్నాలు చేస్తే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పోలీసులతో అర్ధరాత్రులు అక్రమంగా అరెస్టులు చేయించడం ఎంతవరకు సమంజసమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎ.మల్లేశం, ఉపాధ్యక్షురాలు బాలమణి ప్రశ్నించారు. శనివారం రామాయంపేటలో అక్రమ అరెస్టులకు నిరసనగా పాత జాతీయ రహదారి వద్ద సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు.

ముందస్తు అరెస్టులు చేయడం సిగ్గుచేటు

నర్సాపూర్, మార్చి 22: ముందస్తుగా అరెస్టులు చేయడం సిగ్గుచేటని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కడారి నాగరాజు మండిపడ్డారు. ప్రభుత్వం ముందస్తు అరెస్టులు చేయడాన్ని నిరసిస్తూ నర్సాపూర్‌లో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు.

ప్రభుత్వ అక్రమ అరెస్టులు సరికాదు

మనోహరాబాద్: గ్రామ పంచాయతీ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆసీఫ్‌ను ముందస్తు అరెస్ట్ చేసిన మనోహరాబాద్ పోలీసులు. అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని నాయకులు తెలిపారు.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

పాపన్నపేట, మార్చి 22: ఉరేసుకుని మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని కొత్తపల్లిలో జరిగింది. ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం.. ఊట్ల భువనేశ్వరి(33) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నది. శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కాసేపటికి ఇంట్లోకి వచ్చిన కుటుంబీకులు గమనించి చికిత్స నిమిత్తం మెదక్ జిల్లా దవాఖానకు తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు. తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నీట మునిగి వ్యక్తి మృతి

పాపన్నపేట, మార్చి 22: స్నానం చేసేందుకు చెరువులోకి దిగిన వ్యక్తి నీట మునిగి మృతి చెందిన ఘటన పాపన్నపేటలో శనివారం జరిగింది. ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం.. కట్ట ఏసు (30) పశువులను మేపుతూ జీవితం గడుపుతున్నాడు. ఈనెల 20న పశువులను మేపేందుకు గ్రామ శివారులోకి వెళ్లాడు. పశువులు వచ్చినా ఏసు ఇంటికి తిరిగి రాలేదు. చుట్టూ పక్కల గాలించినా ఆచూకీ దొరకలేదు. శనివారం పాత చెరువు వద్ద ఏసు దుస్తులు, చెప్పులు కనిపించడంతో చెరువులో గాలించారు. మృతదేహం లభ్యమైంది. స్నానానికి వెళ్లిన ఏసు నీట మునిగి మృతి చెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యార్థి అదృశ్యం

రేవంత్‌కుమార్

శివ్వంపేట, మార్చి 22: విద్యార్థి అదృశ్యమైన ఘటన శివ్వంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై మధుకర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. దంతాన్‌పల్లికి చెందిన రేవంత్‌కుమార్ తూప్రాన్‌లో ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదవుతున్నాడు. 22న మద్యాహ్నం పొలానికి వెళ్లి వస్తానని వెళ్లాడు. ఇంటికి రాకపోవడంతో ఫోన్ చేయగా స్విచాఫ్ వచ్చింది. వెంటనే పొలానికి వెళ్లి చూసినా, తెలిసిన వారి వద్ద అడిగినా ఆచూకీ దొరకలేదు. తండ్రి గొల్ల మల్లేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇద్దరు పిల్లలతో మహిళ అదృశ్యం

సిరివెన్నెల, పిల్లలు

నర్సాపూర్, మార్చి 22: దవాఖానకు వెళ్లి వస్తామని చెప్పి, ఇంటి నుంచి వెళ్లిన మహిళ తన ఇద్దరు పిల్లలతో అదృశ్యమైన ఘటన నర్సాపూర్‌లోని సునీతాలక్ష్మారెడ్డి కాలనీలో చోటుచేసుకుంది. ఎస్సై లింగం తెలిపిన వివరాల ప్రకారం.. పిల్లముల్ల సిరివెన్నెల, తన కుడి చేయి విరిగిందని, వైద్యం చేయించుకోడానికి తన ఇద్దరు పిల్లలు శ్రీయుత (4), బాబు మన్విత్(9 నెలలు)ను తీసుకుని ఈ నెల 20న షాపూర్‌లోని దవాఖాన వెళ్లింది. ఆ తరువాత సిరివెన్నెల ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో ఆమె భర్త భూపతిరాజు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. ఆయన శనివారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

నర్సాపూర్, మార్చి 22: ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని ఏపీఎం గౌరీశంకర్ పిలుపునిచ్చారు. నా మొక్క నా బాధ్యత-అమ్మ పేరు మీద మొక్క అని పేరు పెట్టి తుజాల్‌పూర్‌లో మొక్కలు నాటారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

EAPCET NEET
ONLINE CRASH COURSE
30 days @ Rs 8888/-
TEST SERIES
5 Grand Tests @ 888/-
50% Discount Today
Call: 8645 322 633
Jatadhara Ed Tech

WANTED
★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-330663-All

TOURS & TRAVELS
★ 16/04/25 అయోధ్య, కాశీ, నేపాల్, ముక్తినాథ్ యాత్ర & 09/05/25 సరస్వతీ పుష్కరాలు, చార్‌ధామ్ యాత్ర. రై+బ+భో+వ. భా